

వై. వరలక్ష్మి

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ టేబుల్ మీది ఫోన్ మోగటం మొదలు పెట్టింది.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు ధర్మారావు. బలవంతంగా కళ్లు తెరిచాడు.

నైట్ బల్బ్ మసగ్గా వెలుగుతూంది. లైట్ స్విచ్ వేసి టేబుల్ దగ్గిరికి నడిచి ఫోన్ అందుకొన్నాడు.

"హలో!"

"......"

"రైలు ప్రమాదమా?"

"......."

"అలాగే... నేను ఇప్పుడే కారులో బయలుదేరి వెళుతున్నాను..."

ఫోన్ పెట్టేశాడతను. లైటు చూడగానే గదిలో పైన గూటిలోని పిచ్చికపిల్లలు కిచకిచలాడాయి. రజని కూడా లేచి కూర్చుంది.

"ఎక్కడినుంచి ఫోను?" అతని వంక చూస్తూ అడిగిందావె.

చిన్నగా నవ్వాడు ధర్మారావు.

"ట్రెయిన్ ఆక్సిడెంట్ అయిందిట, ఇరవై మైళ్ల దూరంలో!"

బట్టలు మార్చుకోసాగా డతను. ఆమె బధ్ధకంగా లేచి కూచుంది.

గడియారం రెండు గంటలు కొట్టింది.

"నువ్వు పడుకో! నీ నిద్రెందుకు పాడవటం?"

ఆమె వినలేదు. జవాబు చెప్పకుండానే అతని సూట్‌కేసు తీసుకొని కావలసిన సామాన్లు అందులో ఉంచసాగింది. ఈలోగా ధర్మారావు బయటికి నడిచి నిద్రపోతున్న దుర్గారావుని లేపేడు. ఇంకా తయారవుతూండగానే దుర్గారావు కారు గారేజ్ నుంచి బయటికి తీసుకువచ్చి హారన్ మ్రోగించేడు. ధర్మారావు బయటికి నడిచాడు. రజని అతనితోపాటు గేటు వరకు వచ్చింది. చలిగాలి విదిలించి కొడుతూంది. దుర్గారావు సూట్‌కేసు, మెడికల్ బాగు తీసుకువచ్చి కారులో ఉంచేడు.

"మళ్లీ ఎప్పటికి వస్తారు?" ధర్మారావు కారులో కూర్చున్న తరవాత అడిగిం దామె.

"ఏమో చెప్పలేను. అది ఎంత పెద్ద ప్రమాదమో తెలీదు. బహుశా రేపు మధ్యాహ్నానికల్లా వచ్చేస్తాను..."

కారు చీకటిని చీల్చుకొంటూ బయలుదేరింది. ఓ నిమిషం వరకు కారు వెళ్లినవంకే చూస్తూ ఉండి పోయి నిట్టూర్చి లోనికి నడిచింది రజని.

దారి పొడుగూతా ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు దుర్గారావు. ఊకొడుతున్నాడు ధర్మారావు. కాని అతని మనస్సంతా రజనిమీదే ఉంది. తమకి వివాహమయి పదేళ్లవుతూంది. ఇంకా భగవంతుని దయ కలగలేదు. సంతానం లేదు. తను రైల్వేలో డాక్టరు. రజని ఓ లక్షాధికారి కూతురు. బోలెడు డబ్బు ఉంది. సుఖం లేదు. సంతోషం లేదు. రజనికి అదే దిగులు. ఒంటరితనం. ఒకరి కొకరు తోడున్నా ఇద్దరూ ఘోరమయిన ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. హాస్పిటల్లో పిల్లలు వద్దనుకొనేవాళ్లకి ఆపరేషన్ చేసేటప్పుడు తనకి నవ్వు వస్తుంది. వాళ్లకి పిల్లలెక్కువయ్యారు. తనకి లేరు! ఎవరయినా ముద్దుగొలిపే పాపను చూసినప్పుడు రజని అదోలా అయిపోతుంది. ఆ రోజంతా తనతో ఎక్కువగా మాట్లాడదు. ఓసారి అడిగేసింది:

"ఎవర్నయినా అడిగి ఓ పాపను పెంచుకొందామండీ!" ఆమె కళ్లలో నీళ్లు.

తనకీ అదే అనిపించింది. కాని ఓరోజు ఆ గుమాస్తా చెప్పిన జవాబు తనకి మళ్లీ ఆ ఆలోచన కలిగించలేదు. అయిదుగురు చిన్నచిన్న ఆడపిల్లలతో హాస్పిటల్‌కి వచ్చా డతను. పిల్లలందరికీ జ్వరం. ఆఖరి పిల్లకి నాలుగేళ్లుంటాయి. ముద్దుగా, అందంగా ఉంది. ఆ పాపని చూస్తూ తను మైమరిచిపోయాడు. ఆ మైమరుపులోనే అతన్ని అడిగేసేడు.

"ఈ పాపని... మీ కిష్టమయితే ... నన్ను పెంచుకోనీండి ... మీకు ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాను..."

అతను నవ్వేడు. నవ్వు చూస్తేనే తనకి భయం వేసింది. అతని జవాబు ఆ నవ్వులోనే లభించింది.

"మనుషుల్ని డబ్బుతో కొనడం కష్టం, సార్! ఎంత బీదవాడినయినా నా పిల్లలు నాకు బరువు కాదు..."

కారు ఓ చిన్న రైలుస్టేషన్ దగ్గిర ఆపాడు దుర్గారావు.

ధర్మారావు దిగి స్టేషను లోకి నడిచేడు.

"ఆక్సిడెంట్ సైట్ ఇక్కడి కెంత దూరం? కారులో వెళ్లవచ్చా?" అసిస్టెంట్ స్టేషన్‌మాస్టరుని అడిగేడు.

"మీకు కారుంది గదండీ! బై రోడ్ వెళ్లండి. అరమైలుంటుంది ఇక్కడికి ఆ వంతెన. రోడ్డువంతెన పక్కనే రైలువంతెన. బ్రేక్‌డౌన్‌కూడా వచ్చేస్తూంది లెండి..."

మరో అయిదు నిమిషాల్లో వంతెన దగ్గిరికి చేరుకొంది కారు. డోర్ తెరిచి బయటికి దిగాడు ధర్మారావు. అంతా కటికచీకటి. చలిగాలి రివ్వున దూసుకుపోతూంది. దూరంగా జనమంతా గగ్గోలుపడుతున్న శబ్దాలు వినబడుతున్నాయి. కొంతమంది ఏడుపులు స్పష్టంగా వినిపిస్తున్నాయి. టార్చిలైట్ తీసుకొని ముందుకి నడిచేడు ధర్మారావు. డోర్స్ లాక్‌చేసి మెడికల్ బాగ్ తీసుకొని తనూ వెనక నడిచేడు దుర్గారావు. అంతా మెత్తని ఇసుక. నదిలో నీళ్లు లేవు. కాళ్లు ఇసుకలో దిగబడిపోతున్నాయి. దగ్గిరవుతున్నకొద్దీ పెద్ద ఏడుపులు, మూలుగులు, అరుపులు స్పష్టంగా వినిపిస్తున్నాయి. వంతెనమీదనుంచి క్రిందికిఅడ్డదిడ్డంగా పడిపోయిన రైలుపెట్టెలు చీకట్లో, కటికచీకటిలా నల్లగా కనిపిస్తున్నాయి.

ఏడుపులు, ఆర్తనాదాలు—బాధతో మూలుగులు, మరీ దగ్గిరగా.

ఆగిపోయాడు ధర్మారావు. కీచురాళ్ల, ఇలకోళ్ల రొద విపరీతంగా, భయంకరంగా ఉంది. ఆ రొదలోనే ఉండి ఉండి ఓ చిన్న పిల్ల ఏడుపు సన్నగా వినబడుతూంది.

"ఎవరో చిన్నపిల్ల దగ్గిర్లోనే ఉంది, సార్!" తనూ ఆగి అన్నాడు దుర్గారావు. ఆ ధ్వని వినబడేవైపు టార్చిలైట్‌తో చూసుకొంటూబయలుదేరేడు ధర్మారావు. నది మధ్యలో అక్కడక్కడ పొదలు గుబురుగా ఉన్నాయి. చాలా దగ్గిరయింది గొంతు. వెలుగులో కలియజూస్తున్నాడు ధర్మారావు. మరికొంచెం ముందుకి నడిచి టార్చి చుట్టూతా తిప్పి చూశాడు. హఠాత్తుగా ఏడుపు ఆగిపోయింది. వెలుగులో పక్కనే ఉన్న గుబుర్లో ఓ పాప మంచుని ఉంది. కళ్లు చిట్లించుకొని టార్చిలైట్‌వేపు చూడ్లేక చూస్తూంది. బుగ్గలవెంబడి జారుతున్న కన్నీళ్లు టార్చిలైటు కాంతిలో మెరుస్తున్నాయి. సుమారు నాలుగేళ్ల వయస్సుంటుంది. పచ్చని గౌను తొడుక్కుని తెల్లగా, ముద్దుగా ఉంది. అప్పటివరకూ ఏడుస్తూండటంచేత రొప్పుతూంది.

ఆ పాపను చూడగానే ధర్మారావు హృదయమంతా విపరీతమయిన జాలితోను, ప్రేమతోను నిండిపోయింది. పాప దగ్గిరగా నడిచా డతను. కంగారుగా, భయంగా చూస్తూంది పాప. పాప ఒంటిమీద అక్కడక్కడ గీరుకుపోయిన

> *తమకు కానిది, కావాలనుకున్న స్వార్థంతో ఇతరుల హృదయాలను క్షోభ పెడితే, ఆ 'ఉసురు' ఊరకేపోదు ... ఇతరుల మంచిపైన, సుఖసంతోషాలపైన మనిషి సుఖజీవనం ఆధారపడి ఉంటుంది ఎప్పుడు. స్వార్థం అన్నది ఎంతగానీ, అది మనిషినో, మనసునో బలి తీసుకోక తప్పదు.*

గీతలు కనబడుతున్నాయి. ఒకటి రెండు చోట్ల కొంచెం నెత్తురుకూడా వస్తూంది. టార్చిలైట్ దుర్గారావు కిచ్చి పాపకు దగ్గిరగా వెళ్లాడు. వెలుగులో అతన్ని చూసి భయంగా వెక్కి, తగ్గింది పాప. ఆమె గౌనుని గుబురులో ముళ్లు పట్టుకొన్నాయి.

"రా, పాపా! ఎత్తుకొంటాను రా!" దగ్గిరగా కూర్చుంటూ అన్నాడు ధర్మారావు.

"అమ్మ... కావాలి..." అంది పాప ఏడుపుముఖంతో.

"అమ్మ దగ్గిరికి నేను తీసుకు వెళతాను రా!" పాప గౌను ముళ్లనించి విడిపించే డతను.

అతనిని ఓ క్షణం చూసి బెదురుగానే అతని చేతుల్లోకి వచ్చింది. భుజాల మీదికిఎత్తుకొన్నాడుపాపని.ఎందుచేతో అతని హృదయం సంతోషంతో, ఆనందంతో ఉప్పొంగింది. గాఢంగా హృదయానికి హత్తుకొని ముద్దు పెట్టుకొన్నాడు.

"పాప అదృష్టవంతురాలు, సార్! ఒక్క దెబ్బకూడా తగల్లేదు. ఈ రైల్లోనుంచే పడిపోయి వచ్చేసినట్టుంది. వీళ్లమ్మ కేమయినా దెబ్బలు తగిలినాయో ఏమో!" దుర్గారావు అంటున్నాడు.

పాప ఏడుపు మానేసి ధర్మారావు భుజంమీద తలవాల్చుకొని పడుకొంది. చలికి వణుకుతూంది. ధర్మారావుకి కళ్లవెంబడి నీళ్లు తిరిగాయి. తన కోటు తీసి పాపమీద కప్పాడు.

"అమ్మ ఏదీ?..." అడిగింది పాప.

"వెళ్దాం! అమ్మ దగ్గిరికే వెళ్దాం!"

ఓ క్షణం ధర్మారావుని ఆలోచనలు చుట్టుముట్టినాయి.

'పాప తల్లి బ్రతికుందో, చనిపోయిందో? బ్రతికుంటే పాపని వదిలేది కాదు. బహుశా చనిపోయి ఉండవచ్చు. లేదా తీవ్రంగా గాయాలు తగిలి ఉండవచ్చు. అలా అయినా బ్రతకటం కష్టమే. అప్పుడు ఈ పాప ఏమవుతుంది? ఏం చేస్తారు? తండ్రి ఉంటే వచ్చి తీసుకెళ్లిపోతాడు. లేకపోతే బంధువు లెవరయినా తీసుకొంటారు. తండ్రి అయినా, బంధువులయినా పాపని సరిగ్గా చూస్తారా?...'

మరో ఆలోచన తళుక్కున మెరిసింది.

"ఈ పాపని తనే ఉంచేసుకొంటే!"

అవును! అలా చేస్తే?... అంతే! అలాగే చేయాలి. ముచ్చటయిన ముద్దులు చిందే ఈ పాప తన దవ్వ



సపట్
లోషన్
తామర, గజ్జి, చిడుములకు నమ్మకమైన
మరియు పేరుగాంచిన మందు.
SAPAT & CO., BOMBAY 2.
ఏజంటు: ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్
బకింగ్‌హాంపేట, విజయవాడ—2.





RATAN BATRA
CW.TEL/01


తుంది. ఇంట్లో వెలుగు నింపుతుంది. రజనికి ప్రాణం పోస్తుంది. ఏమయినా సరే ఈ పాప తనకి కావాలి. కాని. . . ఎలా. . . ఎలా?. . .'

"మంచుండిపోయారేం, సార్?"

టార్చిలైట్ వెలుగు కాళ్లమీద పడుతూంది.

"దుర్గారావ్!" మెల్లగా పిలిచాడు ధర్మారావు.

"ఏమిటి, సార్?" దుర్గారావు దగ్గిరగా వచ్చి అడిగాడు.

"నాకు ఈ పాపని పెంచుకోవాలని ఉంది. వెంటనే కారులో తీసుకెళ్లి ఎవ్వరికీ తెలీకుండా ఇంట్లో అమ్మగారికి అప్పజెప్పి మళ్లీ రా నువ్వు!"

"మరి. . . మరి. . ." ఏదో నసిగాడు దుర్గారావు.

"ఆలస్యం చేస్తే లాభం లేదు. మిగతా డాక్టర్లు కూడా వచ్చేస్తున్నారు. త్వరగా వెళ్లు. . ."

దూరంగా రెండు కార్ల లైట్లు కనబడుతున్నాయి. దుర్గారావు కారు ఎక్కి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. పాపని డ్రైవరుసీటు పక్కన కూర్చో బెట్టాడు ధర్మారావు. పాప కళ్లు మూతలు పడుతున్నాయి.

"అమ్మ. . ." అంది మగతగా.

దుర్గారావు కారు స్టార్ట్ చేశాడు. వెళుతూన్న కారువంకే చూస్తూ నుంచుండిపోయాడు ధర్మారావు. అతని మనస్సంతా గందరగోళంగా తయారయింది. తను చేసింది న్యాయమయిన పనేనా? ఓ వేళ పాప తల్లి బ్రతికి ఉంటే ఎలా? తల్లినీ, బిడ్డనీ వేరుచేసినట్లు కాదా? బ్రేక్‌డౌన్ పెద్దగా కూత వేసుకొంటూ వస్తూంది. రెండు కార్లు వచ్చి మెల్లగా ఆగాయి. డి. ఎమ్. ఓ., మిగతా ఇద్దరు డాక్టర్లు వాటిల్లోంచి దిగారు. అందరు టార్చిలైట్ల వెలుగులో ముందుకి నడిచేరు. షాకప్‌లో మధ్యకి విరిగిపోయిన పెట్టె కనబడుతూంది. చాలా దగ్గిరగా చేరుకొన్నారు వాళ్లు.

"చాలా సీరియస్ ఆక్సిడెంట్!" డి. ఎమ్. ఓ. అంటున్నాడు.

విరిగిన కారేజ్ కిటికీలో నుంచి రక్తం చుక్కలు చుక్కలుగా కారుతూంది. కొంతమంది పెట్టెకింద పడి ఉన్నారు. కిటికీలోనుంచి కొంతమంది శరీరాలు కనబడుతున్నాయి. గుప్పున వేడిగా రక్తం వాసన కొట్టింది ధర్మారావుకి. కళ్లు తిరిగిన ట్లనిపించిందతనికి. బ్రేక్‌డౌన్ వచ్చి దగ్గిరగా ఆగింది.

ఏడుపులు బిగ్గరగా గుండె అదిరే

టట్లు వినబడుతున్నాయి.

జెనరేటర్ ద్వారా ఫ్లడ్‌లైట్లు అమరుస్తున్నారు.

కొద్దిసేపట్లోనే ఆ ప్రదేశమంతా కాంతివంతమయిపోయింది. పెట్టెల్లో ఇరుక్కుపోయిన చాలామందిని బయటికి లాగుతున్నారు. ఎక్కువమంది చని పోయారు. కట్లు కట్టడం, మందులు వేయడం—వీటితో ఎప్పుడు తెల్లారిందీ ధర్మారావుకి తెలీలేదు. చాలామందిని అంబులెన్సుల్లో హాస్పిటల్‌కి పంపించి వేశారు. తెల్లవారేసరికి ఓ శ్మశానంలా భీకరంగా ఉందా ప్రదేశం—కాళ్లు లేని వాళ్లూ, చేతులు లేనివాళ్లూ, తలలు చితికిపోయిన శరీరాలూ, తలలు తెగి పోయిన శరీరాలూ.

మధ్యాహ్నానికల్లా పని పూర్తి అయింది. అందరూ ఇళ్లకు బయలు దేరారు. ధర్మారావు తన కారు దగ్గిరికి వచ్చాడు. దుర్గారావు కారులో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. చటుక్కున పాప గుర్తు వచ్చింది ధర్మారావుకి. పాప సంగతి అసలు మరిచేపోయాడు తను. గుండెలు వేగంగా కొట్టు కొంటున్నాయి.

"దుర్గారావ్! పాప ఎలా ఉంది?"

"ఉండి ఉండి 'అమ్మా' అని ఏడుస్తూంది, సార్! అమ్మగారు వదల కుండా ఎత్తుకు తిప్పుతున్నారు. . ."

ఇల్లు చేరుకొనేసరికి సాయంత్రం నాలుగవుతూంది.

ఇంట్లో రజని పాప నెత్తుకొని అటూ ఇటూ తిప్పుతూంది.

"ఏమండీ! నీళ్లమ్మ జాడ ఏమయినా తెలిసిందా?" ఆత్రతగా అడిగింది రజని.

"ఊఁహూఁ! లేదు, రజనీ! ఈ పాప గురించి ఎవ్వరూ అడిగినవాళ్లే లేరు. ఏమయ్యారో తెలీడం లేదు. . ."

"అయితే పాప మన దగ్గిరే ఉండి పోతుందా? ఎవ్వరూ తీసుకువెళ్లరా?" సంతోషంతో పొంగిపోతూ అడిగిందామె.

ధర్మారావు పాపని తన చేతుల్లోకి తీసుకొని ముద్దు పెట్టుకొని రజనికి అందించేడు.

"ఎవ్వరూ తీసుకెళ్లరు, రజనీ! పాప మన దగ్గిరే ఉంటుంది!"

మరునాడు స్త్రీల వార్డులో గాయాలు తగిలినవారిని చూసుకొంటూ బయలుదేరాడు ధర్మారావు. ఓ బెడ్ దగ్గిరికి వచ్చేసరికి ఒకతను మాసిన గడ్డంతో బెడ్‌దగ్గిరే మంచుని కనిపిం చాడు. పాతికే ళ్లుంటాయి అతనికి.

"సార్! ఈమె కేమీ ప్రమాదం లేదుకదా?" అడుగుతూంటే అతని కళ్లవెంబడి నీళ్లు తిరిగాయి.

పేషెంట్‌వంక చూశాడు ధర్మా రావు. ఆమె తలకు బలమయిన దెబ్బ తగిలింది. స్పృహలో లేదు.

"మరేం ఫర్వాలేదు. . . మీ రెవరు?"

"ఈమె నా భార్యండీ! స్వయంగా స్నేహమకి వచ్చి రైలెక్కించేను. ఈ దారుణం జరిగిపోయింది. మా పాప శవంకూడా చూడ్డానికి దొరకలేదు..." అతని కళ్లవెంబడి నీళ్లు కారిపోతూ న్నాయి.

ధర్మారావు ఉలిక్కిపడ్డాడు.

"శవం దొరకలేదా?"

"లేదు, సార్! పసిపిల్లల శవాలన్నీ చూశాను. అందులో కొన్ని గుర్తు పట్టటానికి వీల్లేనంతగా చితికి పోయాయి. ఓ వేళ అందులోనే మా పాపకూడా ఉందేమో! కాని మా పాప తొడిగిన పచ్చగౌను అసలు కనిపించ లేదు. . ."

ఆమె కొద్దిగా కదిలింది.

"త్వరలోనే ఈమెకి స్పృహ రావచ్చు! మీ రేం కంగారు పడకండి!" ముందుకి నడిచాడు ధర్మారావు.

'పచ్చగౌను!. . . అంటే. . . తన దగ్గిరున్న పాపే అయిఉంటుంది. . .' వెనక్కి తిరిగి మరోసారి అతనివంక చూశాడతను. ఖచ్చితంగా తెలుస్తూంది. అతని పోలికలు చాలావరకూ పాపలో ఉన్నాయి.

పేషెంట్లందరినీ చూసి తిరిగి వచ్చేస్తూంటే ఆమె నీరసంగా మాట్లాడుతూంది.

"పా. . . ప. . . ఏ. . . ది?"

ధర్మారావుకి మనసు విలవిలలాడింది. తల్లీబిడ్డలను విడదీశాడు తను. ఇంత కంటె పాపం మరోటి ఉంటుందా? అత నేం జవాబు చెబుతాడు? పాప చనిపోయిందని చెప్పేస్తాడా? దగ్గిర్లోనే బెడ్‌మీద మరో పేషెంట్‌ని పరీక్షించే వంకతో ఆగిపోయా డతను.

ఆమె భర్త ఆమెకి నచ్చచెబు తున్నాడు.

"పాప క్షేమంగా ఉంది, శాంతా! నిజం! నువ్వు కంగారుపడవద్దు. నీకు విశ్రాంతి అవసరం అని చెప్పారు డాక్టరుగారు. ఏమీ ఆలోచించవద్దు. అలా అయితే త్వరగా కోలుకొంటావు."

అలా చెబుతున్నప్పుడు అతని ముఖం వివర్ణమైపోయింది.

ధర్మారావు అక్కడనించి వేగంగా బయటికి నడిచేడు.

అతను నిజంగా పాప చనిపోయి ఉంటుందని నమ్మేడు. నిజాన్ని అబ ద్ధంగా భార్యకు చెబుతున్నాడు. లోలోపల కుమిలిపోతున్నట్లు కనబడుతున్నాడు.

మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి పాప గట్టిగా ఏడుస్తూంది. బట్టలు మార్చుకోకుండానే పాప దగ్గిరికి పరి గెత్తేడు. రజని పాపని ఎత్తుకొని ఊరడిస్తూంది.

"చంపేస్తూందండీ పొద్దుటి నించీ! ఒకటే ఏడుపు. . ."


"అలా కాసేపు తోటలో తిప్పు! ఊరుకొంటుందేమో!"

పాపని తీసుకొని బయటకు వెళ్లింది రజని. పాప "అమ్మా" అంటూ ఏడవటం అతనికి గదిలోకి వినిపిస్తూనే ఉంది. నిస్పృహగా కుర్చీలో కూలబడ్డా డతను. పైన గూడులోని పిచ్చిక పిల్లలు కంగారుగా అరుస్తున్నాయి. చాలాసేపు వరకూ వాటివంకే చూస్తూండిపోయా డతను.

రజని తిరిగి లోపలికి వచ్చింది. పాప ఏడుపు మానేసి నవ్వుతూంది. తన చేతుల్లోకి తీసుకొని గాఢంగా హృదయానికి అదుముకొన్నా డతను.

'పాపం! నోరులేని పసిది! మభ్య పెట్టి, స్వార్థం కోసం మోసం చేస్తు న్నాడు తను. కన్న తల్లికి దూరం చేసేడు. . .' కళ్లవెంబడి నీళ్లు కారుతున్నా యతనికి.

'నవ్వుతూంది, పాపం! అంతకంటె ఏం చేస్తుంది? గుర్తు వచ్చినప్పుడల్లా ఏడుస్తూంది. . .'




చిత్రం—సుధామ (హైదరాబాదు-36)

వారం గడిచింది.

ఆ వారం రోజుల్లోనూ పాప పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పగలంతా ఏడుస్తూంది. అన్నం తినటం లేదు. ఏడుస్తూనే అలిసిపోయి నిద్ర పోతూంది. మేల్కొంటూనే "అమ్మా. . ." అంటూ మళ్లీ ఏడుపు. రజనిని, ధర్మారావుని దగ్గిరికి రానీయడం లేదు. ధర్మారావు కేమీ తోచడం లేదు. పిచ్చెక్కినట్లవుతూంది. తన గదిలోకి పోయి తలుపు వేసుకొని పడుకొన్నాడు. సన్నగా పాప ఏడుపు వినబడుతూనే ఉంది.

పిచ్చికపిల్లలు కంగారుగా, నీరసంగా అరుస్తూనే ఉన్నాయి.

"వాటి తల్లి ఎటో పోయి నాలుగు రోజు లవుతూందండీ! తిరిగి రాలేదు. వీటికి మేత లేదు. అల్లాడిపోతున్నాయి." రజని అంటూంది పొద్దున్న.

వాటివంకే చూశాడు ధర్మారావు. గూటిలోనుంచి బయటికి రావడానికి ప్రయత్నించి మళ్లీ లోపలికి తగ్గు తున్నా యవి.

"వీటికి తిం డెలా?"

తెలీలేదు ధర్మారావుకి. వాటి తిం డేమిటోకూడా తెలీలేదు.

"ఇక అవి అలా తిండి లేకుండా గడపవలసిందేనా?"

"పాపకి అమ్మ కావాలి. వీటికి తిండి కావాలి. తమకి పాప కావాలి."

"మేం వెళుతున్నాం, సార్! థాంక్యూ వెరీ మచ్! మీరు మాకు చాలా

సహాయం చేసేరు!''

ఆమెను తీసుకు వెళ్లిపోయేప్పుడు హాస్పిటల్లో తన గదికి వచ్చి చెప్పివెళ్లా డతను.

ఆమె నమస్కరించింది. ఇద్దరూ బయటికి వెళ్లిపోయేరు. వెళ్లి పోతూంటే మనసు గిలగిలలాడింది. 'తను వాళ్లకి సహాయం చేశాడా? ఏ విధంగా? పాపను దొంగిలించా?. . .'

చాలాసేపు నవ్వుకొన్నాడు ధర్మా రావు. నవ్వు ఆగాక చూస్తే కళ్ల వెంబడి నీళ్లు కారిపోతూన్నాయి. పాపం, ఆమె కింకా తెలీదు. పాపని బంధువులు తీసుకు వెళ్లేరని అబద్ధం చెప్పే డతను. ఆ ఆశతోనే ఆమె త్వరగా డిశ్చార్జి తీసుకొని ఇంటికి బయలుదేరింది. ఇంటికి వెళ్లాక నిజం తెలుస్తుంది. పాప చనిపోయిందని చెబుతాడతను. ఆమె తట్టుకోగలదా? ఓర్చుకుంటుందా?... పరుగుతో వాళ్ల వెనక వెళ్లి వాళ్లతో పాప తన దగ్గిరుందని చెబుదామనిపించిం దతనికి. కానీ, ఆ పాప లేకపోతే తనెలా ఉండగలడు?

పిచ్చికపిల్లలు ఇంకా అరుస్తూనే ఉన్నాయి.

వాటి కేదయినా మేత పెట్టా లనిపించిం దతనికి.

వెంటనే కొంచెం పాడిఅన్నం కాగితంలో ఉంచి గూటిలోకి నెట్టేడు.

అవి అరవటం మానివేశాయి. ధర్మా రావుకి కొద్దిగా సంతోషం కలిగింది.

బయట పాపకూడా ఏడుపు ఆపివేసింది. రజని ఏవేవో కబుర్లు చెప్పి ఊరడిస్తూంది. అంతకు ముందు రోజే ఆమె పాపకి చక్కని గౌనులూ, రకరకాల బొమ్మలూ కొనుక్కు వచ్చింది.

మరునాడు పొద్దున్నే ధర్మారావుని కంగారుగా నిద్ర లేపింది రజని.

''ఏమండీ!పాపకి జ్వరం వచ్చింది.''

ఉలిక్కిపడ్డాడు ధర్మారావు. ఒక్క ఉదుటున లేచి పాప దగ్గిరికి పరి గెత్తేడు. ఒళ్లు కాలిపోతూంది పాపకి.

''అమ్మ. . . అమ్మ. . .'' అంటూ కలవరిస్తూంది పాప, కళ్లు తెరవ కుండానే.

ధర్మారావు కేమీ పాలుపోవడంలేదు. సిరింజిలోకి మందు తీసుకొని వెంటనే ఓ ఇంజక్షన్ ఇచ్చేడు. ఆ వేళంతా హాస్పిటల్‌కి వెళ్లకుండా పాప దగ్గిరే గడిపాడు.

సాయంత్రానికి జ్వర తీవ్రత కొంచెం తగ్గింది. రాత్రంతా రజని మేలుకుని పాప దగ్గిరే కూర్చొంది.

పొద్దున్నకి జ్వరం మళ్లీ ఎక్కు వయింది. పాప ఏమీ తాగటం లేదు. మందు, గ్లూకోజూ— ఏది తాగించినా ఊసేస్తూంది.

''అమ్మ. . .'' అంటూ అప్పు డప్పుడూ కలవరించటం మాత్రం మానలేదు.

ధర్మారావుకి భయంగా ఉంది. పైకి చెబితే రజనికూడా కంగారుపడు తుందేమోనని గంభీరంగా ఉన్నాడు. సాయంత్రానికి పాప ముఖం పూర్తిగా వాడిపోయింది. కాళ్లూ, చేతులూ వేలాడి పోతున్నాయి.

''ఏమండీ! పాప దక్కుతుందో, లేదో భయంగా ఉందండీ!. . .''

ఏడ్చేస్తూంది రజని. ధర్మారావు ఏమీ మాట్లాడలేదు. పాప పరిస్థితి పూర్తిగా అయోమయంగా ఉంది. ఎన్ని మందులు వాడినా లాభం లేకపోతూంది.

''వద్దండీ! పీళ్లమ్మావాళ్లు మొన్నే వెళ్లిపోయారన్నారు గదా! వాళ్ల దగ్గిరికి పంపించెయ్యండి. లేకపోతే మీరే తీసుకువెళ్లి ఇచ్చెయ్యండి. తల్లిమీద బెంగ పెట్టుకొందండీ!''

ఉక్కిరిబిక్కిరవుతున్నాడు ధర్మారావు.

తను క్రూరుడు. వాళ్ల అడ్రసుఅయినా అడిగి తీసుకోలేదు. కనీసం ఊరయినా అడగలేదు. ఓ వేళ తెలిసినా పాపని ఈ పరిస్థితిలో వాళ్ల కెలా ఇవ్వటం? వాళ్లు తనని తేలిగ్గా క్షమించరు. తనమీద పోలీస్ రిపోర్ట్ ఇచ్చినా ఇవ్వవచ్చు.

రాత్రి పన్నెండవుతూంది.

పాప స్పృహలో లేదు. ఎక్కిళ్లు వస్తున్నాయి.

''ఏమండీ! ఎలాగండీ? చూస్తూ చూస్తూ ఈ చిన్ని ప్రాణాన్ని మన చేతులతోనే తీస్తున్నాము. ఏం చేయడ మండీ? ఎలాగోలా. . . పాపని బ్రతికించండీ!. . .''

ఉప్పెనలా ఏడ్చేస్తూంది రజని అతనిమీద వాలిపోయి.

ధర్మారావుకి తెలుసు. పరిస్థితి చేయి దాటిపోయింది. తను చేయగలిగిం దేమీ లేదు. చేయగలిగిందంతా చేసేడు. మందులవల్ల నయం కా దిది. పాపకి అమ్మ కావాలి. అమ్మ ఎక్కడుందో తనకి తెలియదు. తెలిసినప్పుడు ఆ అవకాశాన్ని తను చేజేతులా పాడు చేసుకొన్నాడు. దీని కంతటికీ కారణం తను! తనే ఇంత పని చేసేడు. పాప కొనఊపిరితో ఉంది. అక్కడ ఆ మాతృహృదయం నిజం తెలుసుకొని ఎంత క్షోభించిపోతుందో?

టైము రెండయింది.

రజని వెక్కి వెక్కి ఏడుస్తూంది.

''మీ రెందు కిలాంటి పని చేసేరు? మనం ఇంకెవరినయినా తల్లీ తండ్రీ లేని పిల్లలను పెంచుకొనేవాళ్లమే. . . ఇప్పు డీ పాప కేమయినా జరిగితే. . . ఆ పాపం మనది కదూ. . . భగవంతుడా?''

తన గదిలోకి వెళ్లి కుర్చీలో కూల బడ్డాడు ధర్మారావు. హఠాత్తుగా అతని దృష్టి కింద పడి ఉన్న అన్నం మెతుకులమీద పడింది. తను పొద్దున్న పెట్టిన మేత అది. కాగితం, మెతుకులు పక్కనే రెండు పిచ్చికపిల్లలు పడి ఉన్నాయి. ఒక పిల్ల కొంచెంగా కదులు తూంది. రెండోది చనిపోయింది. చీమలు దాన్ని చుట్టుకొంటున్నాయి.

'చచ్చిపోయింది. . .'



గొణుక్కున్నాడు ధర్మారావు. 'పాప! పాపకూడా చనిపోతుంది. కేవలం తన మూలాన చనిపోతుంది. భగవాన్! నా చేత ఎందు కిలాంటి పని చేయించావు? ఇప్పు డీ విధంగా ఎందుకు చిత్రవధ చేస్తున్నావు? నేను భరించలేను. . . భరించలేను. . .'

తనకు తెలీకుండానే బిగ్గరగా ఏడ్చేస్తున్నాడు ధర్మారావు.

అతని కళ్లకి పాపే కనబడుతూంది.

గదిలో గుబుర్లో, చీకట్లో నుంచొని తన వంక భయంగా చూస్తూ,

''అమ్మ కావాలి. . .'' అంటూంది పాప.

''వెళదాం! అమ్మ దగ్గిరికి వెళదాం!''

తనని నమ్మింది. పాపం! పాప తనని నమ్మింది. ఆలోచించకుండా తన దగ్గిరికి వచ్చింది.

తన మనసులోని దురుద్దేశం పాప కప్పుడు తెలీదు.

నవ్వుతూన్న పాప ముఖం కనబడు తూం దతనికి. పక్కనే శ్మశానం.

అలమార్లోనించి పాయిజన్ సీసా తీసి టేబుల్‌మీద ఉంచాడు ధర్మారావు

'పాప చనిపోతుంది. పాప చనిపోతే తను బ్రతకలేడు. జీవితాంతం చిత్రవధ తను భరించలేడు. ఆ జీవితం తనకి వద్దు. . .'

సీసా మూత తీశాడు ధర్మారావు.

రెండో పిచ్చికపిల్ల గిలగిల కొట్టు కొని పడిపోయింది. మరి కదల్లేదు.

కెవ్వుమని కేక వినబడింది ధర్మా రావుకి. రజని పరుగుతో వచ్చి అతన్ని కౌగలించుకొని ఏడ్చేస్తూంది.

''ఏమండీ. . . పాప. . . చనిపోయిం దండీ!. . .''

మాట్లాడలేకపోతూంది.

అతని చేతిలోని సీసా కింద పడి ముక్కలయిపోయింది. పాప దగ్గిరికి వెళ్లి చెయ్యి పట్టుకుని చూశాడు. అతని చేతుల్లోంచి పాప చెయ్యి నిర్జీవంగా కిందికి పడిపోయింది. ★